ప్రజా ఫిర్యాదులుకు ప్రాధాన్యత ఇవ్వాలి : ఎస్పీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రజా పిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ,నాణ్యత ప్రమాణాం తో చట్ట పరిధిలో విచారణ జరిపి ప్రజాపిర్యాదులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీకెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి 63 పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. నడవలేని వృద్ధులు, వికలాంగుల వద్దకు జిల్లా ఎస్పీ వెళ్లి వారి సమస్యలు తీసుకొని సమస్యలు పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపిస్తామని భరోసా కల్పించారు.

ప్రభుత్వ శాఖల సిబ్బందికి కంప్యూటర్ శిక్షణ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రభుత్వ శాఖల నుండి ఇద్దరు లేదా ముగ్గురుకి మార్చి 18 నుండి 22 వరకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల నుండి ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేసి సత్వరమే అందజేయాలన్నారు. కంప్యూటర్ శిక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటిలిన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఎక్సెల్ షీట్స్, అడ్వాన్స్ టూల్స్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18, 19 తేదీల్లో కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి, జిల్లా కేంద్రంలో ఉన్న ఆయా శాఖల సిబ్బందికి కలిపి 100 మంది ఉద్యోగులకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కంప్యూటర్ శిక్షణ ఉంటుందని తెలిపారు. మార్చి 20వ తేదీన టెక్కలి డివిజన్ కేంద్రంలో 40 మందికి, మార్చి 21వ తేదీన పలాస డివిజన్ కేంద్రంలో 30 మందికి, మార్చి 22వ తేదీన శ్రీకాకుళం డివిజన్ కేంద్రంలో 30 మంది ఉద్యోగులకు శిక్షణ ఉంటుందని ఆయన వివరించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా దరఖాస్తు దారుల నుండి 184 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ ఉన్నారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్

విశాలాంధ్ర-ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ పరిధిలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ వారం రోజులపాటు నిరసన ధర్నా కార్యక్ర మాలు చేపట్టనున్నట్లు జనరల్ సెక్రెటరీ సాహెరా తెలి పారు. అందులో భాగంగానే సోమవారం స్థానిక ఏడిఈఎన్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమా న్ని చేపట్టారు. ఎన్ ఎఫ్ ఐ ఆర్ జిఎస్ డాక్టర్ ఎం రాఘు వయ్య ఆదేశాల మేరకు సోమవారం నుంచి మార్చి 21వ తేదీ వరకు ఈ కో ఆర్ నందు ఈ కోఆర్ ఎస్ ఈ సమస్యల పరిష్కార వారంగా ప్రకటించి ధర్నా కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఆర్ .సి .సాహెరా మరియు జోనల్ ప్రెసిడెంట్ జై .సంపత్ కుమార్ ఆదేశాల ప్రకా రం శ్రీకాకుళం రోడ్డు బ్రాంచ్%ఁ% నౌవడ బ్రాంచ్ ఇన్‌చార్జ్ సి ఓ బి మెట్ట అనిల్ చంద్ర బ్రాంచ్ సెక్రెటేరియల్ ఎస్ దంతేశ్వరరావు మరియు బి. ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం రోడ్ ఏడి ఈ యన్ కార్యాల యం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ ధర్నా ముఖ్య ఉద్దేశం ఎన్ పి ఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి, అదేవిధంగా కార్మికులకు పై పని ఒత్తిడిని తగ్గించాలి. పదోన్నతులు సకాలంలో కల్పించాలి. వీటన్నిటిపై ధర్నా నిర్వహించి డివిజనల్ రైల్వే మేనేజర్ వారికి ఏడియన్ ద్వారా అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం నౌపడ బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు, నిర్మాణం కి రూ.5 లక్షలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారంగా అర్హులైన పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలం తో పాటు నిర్మాణం కి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ కోరారు. స్థానిక జడ్పీ కార్యాలయం వద్ద సోమవారం మహా ధర్నా నిర్వహించి అనంతరం అర్హులతో పూరించ బడ్డ దరఖాస్తులు తో పాటు వినతి పత్రాన్ని గ్రీవెన్స్ లో కలెక్టర్ కు అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారంగా పేద ప్రజలకు ఇల్లు స్థలాలు ఇవ్వలేదని వెంటనే అర్హులైన ప్రజలకు ఇల్లు స్థలాల తో రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేయాలన్నారు. స్వంత ఇల్లు లేక జిల్లాలో అనేక మంది పేద ప్రజలు అద్దె ఇంట్లో బ్రతుకుతూ చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారని ఈ విషయంపై జిల్లా కలెక్టర్, తహసిల్దార్ స్పందించి జిల్లాలో ఉన్న ఇల్లు లేని పేదలకు వెంటనే మంజూరు చెయ్యాలని కోరారు. టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు అరవింద్, మధు, క్రాంతి స్వంత ఇల్లు లేని పేదలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- 12 అర్జీలు స్వీకరణ - రెవెన్యూ డివిజనల్ అధికారి క్రిష్ణమూర్తి

విశాలాంధ్ర-టెక్కలి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి యం. క్రిష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల నమోదులో 12 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ముఖ్యంగా స్వీకరించిన అర్జీలలో రెవెన్యూ శాఖ-04,గృహ నిర్మాణ శాఖ-03, విద్య శాఖ-01, డ్వామా-01, సర్వే అండ్ లాండ్ రికార్డులు -01, కాలుష్య బోర్డు (ఇ.ఇ)-01, పంచాయతీ రాజ-01 తదితర శాఖలకు సంబంధించి అర్జీలు స్వీకరించినట్లు అలాగే తమ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతకు కఠిన చర్యలు

- ప్రమాదాల నివారణే లక్ష్యం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రోడ్డు భద్రతా చర్యల ఆంక్షలను జిల్లాలో మరింత కఠినతరం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్, కమిటీ చైర్మన్ గా, ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి, కమిటీ మెంబర్ కన్వీనర్ డీటీసీ విజయ సారధి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడిచిన కొద్దిరోజులుగా జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. ఇంజనీరింగ్ శాఖల వారీగా వారి సంబంధిత రహదారులపై తాజాగా జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్ లలో చోటు చేసుకుంటున్నాయని, అయినప్పటికీ హైవే అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ఓ నిండు గర్భిణీ ఆర్టీసీ బస్సు ఢీకొని చనిపోతే సంబంధిత యూనియన్ లోని కొందరు వ్యక్తులు మానవతా విలువలను మర్చిపోయి వ్యవహరించిన తీరు బాధ కలిగించిందని అన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు త్వరిత గతిన పరిహారం అందడం లేదని, బాధితులకు త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. - మత్తు పదార్థాల నియంత్రణపై కలెక్టర్ సమీక్ష... జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల మూల సరఫరా రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. జిల్లాలో మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై తీసుకుంటున్న చర్యలను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డిఎస్పిలు వివేకానందరావు, మూర్తి, వెంకట అప్పారావు, డీపీవో భారతి సౌజన్య, ఆర్అండ్బి ఎస్ఈ జాన్ సుధాకర్, నేషనల్ హైవేస్ అథారిటీ పిడి తీవారీ, జిల్లా ఫైర్ ఆఫీసర్ మోహన్ రావు, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, పలు ఎన్జీఓల ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంశధార సాధన కోసం ఉద్యమించాలి

ప్రాంతాల వారీగా సమావేశాలు నిర్వహించాలి

విశాలాంధ్ర -మందస: మందస మండలంతో పాటు ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గం వరకు వంశధార నది నీరు మళ్లించడానికి ప్రత్యేకంగా సాగునీటి కాలువలు నిర్మించాలని రైతు సంఘాలు,ప్రజా సంఘాలు, వామ పక్షాల నాయకులు డిమాండ్ చేసారు. సోమవారం మండలం హరిపురంలో వంశధార సాధన కమిటీ సమావేశం రైతు సంఘం నాయకులు కొర్ల రామారావు చౌదరి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా వలువురు మాట్లాడుతూ మందస మండలంతో పాటు ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో ఉన్న వేలాది ఎకరాల్లో రైతుల భూములు కేవలం వర్షాధారం మీద ఆధారపడతారని, వరుణుడు కరుణిస్తేనే పంటలు పండుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది ప్రకృతి వైపరిత్యాలతో పాటు సకాలంలో వర్షాలు లేక కరువు ఛాయలు అలము కుంటున్నాయని సమావేశంలో వక్తలు అభిప్రాయ పడ్డారు.పాలకులు నిర్లక్ష్య వైఖరి అభూత కల్పనలతో వంశధార కాలువలు నిర్మించకుండా జాప్యం చేస్తున్నారని, నాలుగు దశాబ్దాలు నుంచి ఈ ప్రాంతం రైతాంగం పొలాలకు వంశధార నీరు సరఫరా చేయాలని కోరినా పట్టించు కోకుండా పాలక వర్గాలు హామీలతో కాలం గడుపు తున్నారని విమర్శించారు.వంశధార కాలువలు నిర్మాణంతో పాటు వంశధార నది నీరు కాలువలు ద్వారా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకొని రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.పలాస నియోజకవర్గంలో పలాస, ,వజ్రపుకొత్తూరు, మండలాల వరకే వంశధార కాలువలు ఉన్నాయని , ఈ కాలువలను ఈ ప్రాంతం వరకు పొడిగింపుకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరారు. వంశధార కాలువలు సాధన కోసం దశల వారీగా ఉద్యమం చేపట్టాలని, ప్రాంతాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రధాన శివాజీ,రిటైర్డు ఎండీఓ సూర్యనారాయణ రెడ్డి, విశ్రాంత ఏం ఇ ఓ మజ్జి బాబూరావు, కొర్ల హేమారావు చౌదరీ, మామిడి మాధవరావు, దర్మాపు వెంకటరావు ,నల్ల హొడ్డి,బి.కామేశ్వరరావు, శిస్టు బాపూజీ, ముకుంద, డి. నారాయణ,ఉగ్రివల్లి,కృష్ణారావు,ఉగ్రివల్లి సూర్యారావు,వెదుళ్ళ మాధవరావు, గొరకల మాధవరావు, దుంపల వైకుంఠ రావు,దుంపల లింగరాజు,తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా చైతన్య యాత్రలు వాయిదా..

విశాలాంధ్ర -మందస: ఉద్దానం కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19న జరప తలపెట్టిన చైతన్య యాత్రలు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కమిటీ అధ్యక్షులు కొమర వాసుదేవ్ తెలిపారు. సోమవారం మందస మండలం గంగువాడ గ్రామంలో ఎయిర్ పోర్ట్ బాధిత రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కమిటీ చర్చించి త్వరలోనే చైతన్య యాత్రల తేదీలు ప్రకటిస్తామని తెలిపారు. ఉద్దానంలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు విషయమై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మరియు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చేన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులకు వినతి పత్రాలు అందజేసిన అనంతరం తదుపరి కార్యాచరణ తేదీలను కమిటీ తెలియజేస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కొమర.వాసుదేవ్, తామాడ తుంభనాదం, చిత్త.కూర్మా రావు, సర్పంచ్ పొట్టి ధర్మారావు, చిత్త.గున్నయ్య, లండ రామస్వామి, జోగి అప్పారావు, మర్ల సంతోష్, దున్న రామారావు, దున్న హరికృష్ణ, గుంటూ.రామస్వామి, బత్తిని.లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

పలాసలో భారీ చోరీ

12 తులాల బంగారం, 30 తులాల వెండి, లక్ష నగదు అపహరణ

విశాలాంధ్ర -పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వులుసుగా దొంగతనాలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దొంగలు చాకచక్యంగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను పసిగట్టి రాత్రుల సమయంలో వాటిలో జొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఆదివారం రాత్రి కాశీబుగ్గ గాంధీగనర్ వివేకానంద. కోలనీలో నివాసం ఉంటున్న మెట్ట సుదర్శనరావు ఇంటిలో బారీ చోరీ జరిగింది. దొంగలు 12 తులాల బంగారం, 30 తులాల వెండి, లక్ష నగదు ను అపహరించారు. బాధితులు, కాశీబుగ్గ పోలీసుల కథనం మేరకు మెట్ట సుదర్శనరావు తన భార్య భానుమతితో కలిసి ఈ నెల 8న దైవ క్షేత్రాలకు దర్శించుకు నేందుకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలను పగలగొట్టి ఉండడాన్ని పరిశీలించి చోరీ జరిగనట్లు గుర్తించారు. ఇంటి లోపలకు వెళ్లి చూసినప్పుడు బీరువా తలుపులు తెరిచి ఉండడం ఇంటిలో సామాగ్రి చిందర వందరగా పడి ఉండడాన్ని గుర్తించి సోమవారం కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికీ బీరువాలో ఉన్న 12 తులల బంగారం, 30 తులాల వెండి, లక్ష నగదు అపహరణకు గురయినట్లు తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే శ్రీకాకుళం క్లూస్ టీమ్ సిబ్బంది వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలన చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ సి.ఐ పి.సూర్యనారాయణ తెలిపారు. ఇటీవల పలాస కాశీబుగ్గలో వరుస దొంగతనాలలో పట్టణ ప్రజలు భయబ్రాం తులకు గురవుతున్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ని విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

ఏఐవైఎఫ్

- వెంటనే నిరుద్యోగ భృతి అందజేయాలి
- బడ్జెట్ లో నిరుద్యోగ భృతి కి నిధులు కేటాయించక పోవడం సరికాదు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన చేస్తామని అప్పటి వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ. 3 వేలు ఇస్తామని గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం 11 నెలలు అవుతున్నా ఆ హామీ నెరవేర్చకుండా నిరుద్యోగులను విస్మరిస్తుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస రావు లు అన్నారు. స్థానిక జడ్పీ కార్యాలయం వద్ద సోమవారం ఏ ఐ వై ఎఫ్ ఆధ్వర్యం లో ఉద్యోగాలు లేవు, నిరుద్యోగ భృతి కుడా లేదు అంటూ ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం సంతోష్, శ్రీనివాసరావు లు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నిరుద్యోగ భృతి ఇవ్వక పోవడం ,ఎన్నికల హామీ లను అమలు చేయడంలో కుటమి ప్రభుత్వం విఫలం చెందిందని, బాబు గారు మెగా డీఎస్సీ ఎక్కడ అని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వము బాకాయి వద్ద 11 నెలల నిరుద్యోగ భృతి రూ.33 వేలు చెల్లించాలన్నారు. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించకపోవడాన్ని వారు దుయ్యబట్టారు. 45 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగినటువంటి చంద్రబాబు నాయుడు తన మేనిఫెస్టోలో చెప్పినటువంటి, ప్రచురించిన మాటలను నేడు మరచి పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ పేపర్ల కే పరిమితమైందని ఆరు నెలలకు గడుస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కాలేదని వేలాదిమంది నిరుద్యోగ యువత ఉద్యోగాల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో తెలియక స్త్రీల మెడలలో తాళిబొట్లు అమ్మి కోచింగ్ సెంటర్లో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఉద్యోగాలు వస్తాయో, రావో అనేటువంటి ఆందోళనలతో ఆత్మహత్యలకు పాల్పడుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకి తెలియడం లేదా అని ప్రశ్నించారు. అందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతూనే గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాల్లో పనిచేసినటువంటి అనేకమంది నిరుద్యోగుల్ని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారన్నారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో నిరుద్యోగ భృతి కి నిధులు కేటాయించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని లేనియెడల ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇల్లును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అరవింద్, వసంత్, మధు, రాజు, క్రాంతి నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

కోటబొమ్మాలి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: కోటబొమ్మాలి మండలం, కోటబొమ్మాలి టౌన్ లో గల జగనన్న కాలనీలో నివాసం ఉటున్న 10వ తరగతి విద్యార్థి (మైనర్) పరీక్షల భయంతో పరారయ్యారు. ఈనెల 17 నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నందున చదువుకుంటే బాగుంటుందని మందలించామని తల్లిదండ్రులు తెలిపారు. ఈనెల 16న ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయారని, బంధువుల ఇండ్ల దగ్గర, పరిసర గ్రామాల్లో వెతికామని అయినా కనిపించలేదని తల్లిదండ్రులు వాపోయారు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కోటబొమ్మాలి సబ్ ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ తెలిపారు.

పాత పింఛను విధానం అమలు చేయాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ: రైల్వే శాఖలో రద్దు చేసిన పాత పింఛను విధానాన్ని తిరిగి అమలు చేయాలని గుర్తింపు పొందిన కార్మిక సంఘం శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పలాస రైల్వే స్టేషన్ వద్ద ఒక రోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ రైల్వే శాఖలో కొత్త ఉద్యోగాల నియామకం జరిపించాలని, పెండింగ్ లో ఉన్న ట్రాక్ మెంటేనర్ల సమస్యలు పరిష్కరించాలని, రన్నింగ్ స్టాఫ్ కు పన్నుల నుంచి 70 శాతం అలవెన్స్ లు మినహాయించాలని కోరారు.రైల్వేలను కార్పోటీకరణ నుంచి తగ్గించాలని, ఒప్పంద ఉద్యోగ నియమకాలను తగ్గించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రవి చౌదరి, విక్రమ రామారావు, తమ్మినేని హరి, ఆర్.వెంకటరావులతో పాటు రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు సీసీ రోడ్డు కి నిధులు

విశాలాంధ్ర -కొత్తూరు: కొత్తూరు మండలంలో పలు గ్రామాల్లో మండల ప్రజా పరిషత్ నిధులు ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయి వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు జోక్యంతో .నిధులు మంజూరయ్యాయి అందులో భాగంగా వాటికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలుచేయడం జరుగుతుంది. ఈ రోజు కొత్త కొత్తూరు గ్రామం లో స్మశానానికి సీసీ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మండలంలోని పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తాతబాబు, కొయిలాపు సంజీవ రావు,రేగేటి కన్నయ్య స్వామి, లోతుగెడ్డ కృష్ణ,చోడవరపు రాము, పాలక రామ్మోహన్, సవర వరాలయ్య, కొనర కాంతారావు, సీపాన శ్రీనివాసా స్వామి మొదలగు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ బృందానికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-రణస్థలం: సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ ర్యాలీ బృందానికి రణస్థలం లో ఘన స్వాగతం లభించింది. సీనియర్ కమాన్డెంట్ సతీష్ కుమార్ బాజ్ పే, డిప్యూటీ కమాన్డెంట్ వినీత్ కుమార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో 80 మంది సభ్యులు ఉదయం 9 గంటలకు రణస్థలం తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తహశీల్దార్ ఎస్.ప్రసాదరావు ఆధ్వర్యం లో వీరికి ఘనంగా స్వాగతం పలికారు. కుంకుమ దిద్ది, హారతి ఇచ్చి పూలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. సీఐ అవతారం నేతృత్వంలో వీరికి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అల్పాహారం అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఏకే సింగ్, అమిత్ కుమార్, ఏకే మహాపాత్రో, షికార్ లోహియా, శ్రీనివాస్ విద్యార్థులకు, యువతకు సీఐఎస్ఎఫ్ విధులు వివరించారు. పశ్చిమబెంగాల్ బకేలి నుంచి ఒక బృందం, గుజరాత్ లఖపథ్ నుంచి ఒక బృందం సైకిల్ ర్యాలీ ప్రారంభించాయన్నారు. పశ్చిమ బెంగాల్ కు చెందిన బృందం 9 రాష్ట్రాల్లో 25 రోజుల పాటు పర్యటిస్తుం దన్నారు. 100 మంది సభ్యులతో 6553 కిలో మీటర్లు ర్యాలీ చేపట్టి మార్చ్ 31 న కన్యాకుమారిలో ముగిస్తామని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా నిషేధం, అక్రమ ఆయు ధాల నివారణ, తీవ్రవాదుల చొరబాటు నియంత్రణ, తీరప్రాంత భద్రత, మహిళా సాధికారత కోసం సీఐఎస్ఎఫ్ కృషి చేస్తుందన్నారు. సమృద్ధ్ సంరక్షణ పేరుతో చేపట్టిన సైకిల్ ర్యాలీ ద్వారా తీరప్రాంత ప్రజలలో , దేశ భద్రత సమైక్యతను పెంపొందిస్తూ, మన దేశ, రాష్ట్ర, జిల్లా ప్రజల్ని భద్రతా సిబ్బందితో మమేకం చేస్తున్నమని తెలిపారు. భారతీయ యువతను దేశ భద్రతలో భాగం చేయడంతో పాటు మన దేశ ఆర్థిక అభివృద్ధి, రక్షణలో మన సైనికుల నిబద్ధత, అకుంఠిత దీక్షను విద్యార్థులు, ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాటు చేసిన వీడియో లు ప్రదర్శించారు. కార్యక్రమం లో ఎస్సై ఎస్.చిరంజీవి, ఏ.ఎస్. ఐ. రమణ మూర్తి, తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది, స్థానిక నేతలు, శ్రీకాకుళం జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట బానోజీ నాయుడు టీడీపీ నాయకులు డీజీఎమ్ ఆనందరావు లంక శ్యామలరావు వీ. ఆర్వో లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ రెండు గ్రామాలను పంచాయతీగానే గుర్తించండి : ఎమ్మెల్యే లేఖ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని తోటపాలెం, కుశాలపురం గ్రామ పంచాయతీలను శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్లో విలీనం చేశార ని, వీటిని తిరిగి గ్రామ పంచాయతీలుగానే గుర్తించాలని కోరుతూ స్థానిక శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ము న్సిపల్ అడ్మినిస్ట్రేషన్ను కోరింది. దీనిపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ స్పందన ఎలా ఉంటుందో వేచిచూడాలి.

మృతుల కుటుంబాన్ని పరామర్శించిన మాజీ స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-పొందూరు: మండలంలో ఇటీవల కాలంలో మృతి చెందిన వైసిపి అభిమానుల కుటుంబాలను మాజీ శాసనసభ్యులు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. గార పేట గ్రామానికి చెందిన లూకలాపు కన్నయ్య సోదరుడు అలాగే వైసిపి నేత శేఖర్ ముఖ్య కుటుంబ నేత అయినటువంటి అమ్మమ్మ మరణంతో వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎల్లవేళలా తమ కుటుంబాలకు అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి లోన్ కాంతారావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు బాడాన సునీల్ కుమార్, స్థానిక నాయకులు గార వెంకటరమణ, వైసీపీ కార్యకర్తలు నేతలు పాల్గొన్నారు.

ఎండలతో పల్లెలు నిర్మానుష్యం

విశాలాంధ్ర-జలుమూరు: సోమవారం నుండి ఎండ తీవ్రత ఆకస్మికంగా పెరగడంతో పల్లెల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏప్రిల్ మే మరో 70 రోజులు వేసవి ఉండగా మార్చిలోనే ఎండ తీవ్రత పెరగడం ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఈ ఏడాది ఎండ తీవ్రత దారుణంగా ఉండవచ్చని పలువురు పెద్దలు అభిప్రాయ వ్యక్తపరుస్తున్నారు. మండల కేంద్రంలో సారవకోట వలు వీధిలు సోమవారం నిర్మాణస్యంగా కనిపించాయి. ఎండకు జడిసి ప్రజలు ఇంటి నుండి బయటికి రాలేకపోయారు.

చైతన్య జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో పలాస విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర-పలాస: శ్రీ చైతన్య నిర్వహించిన జోనల్ స్పోర్ట్స్ మీట్ లో పలాస విద్యార్థులు వివిధ విభాగాల్లో సత్తా చాటారు. త్రో బాల్ బాలికలు సీనియర్, జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం, సీనియర్ బాలురు వాలీబాల్ విభాగంలో రన్నర్స్ గాను ,షటిల్ బ్యాట్మింట్ సీనియర్స్ ,జూనియర్స్ విభాగంలో సింగిల్స్ ,డబుల్ రన్నర్ గాను, సీనియర్ బాలురు విన్నర్ గాను ,జూనియర్ బాలురు బాలిక విభాగంలో రన్నర్స్ ,జూనియర్ భాగంలో షాట్ పుట్ విభాగంలో విన్నర్స్ గాను ,సీనియర్స్ బాలురు బాలికల విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాలు, 100 మీటర్ల బాలుర- బాలికల

పరుగు పందాలులో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. శ్రీ చైతన్య నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీలకు 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యా విధానంలో ఉన్నత భవిష్యత్తుకు చదువు ఎంత అవసరమో శారీరక మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు కూడా క్రీడలు అంతే అవసరం అని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఏజీఎం సురేష్, రీజనల్ఇంచార్జ్ రామ నాయుడు, రీజనల్ కోఆర్డినేటర్ బాలరాజు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డిన్ జోగారావు, సీ బి ఇంచార్జి షణ్ముఖరావు, అసిస్టెంట్ డిన్ ధర్మారావు ప్రైమరీ ఇన్చార్జ్ నేలవేణి మరియు ఏవో జై బాబు పిఈ టీ నేతాజీ విద్యార్థులను అభినందించారు.

ఘనంగా శిరిడి సాయినాధుని ఆలయ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కొత్తూరు: మండలం గులివిందలపేటలో వెలసిన శ్రీ శిరిడిసాయినాథుని ఆలయ 5వ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, యశోదమ్మ దంపతులచే పాలాభిషేకం, వివిధ రకాల అర్చన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అదేవిధంగా గ్రామంలో వెలిసిన కాశీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవములు మామిడి మమత దంపతులచే ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమానికి గులివిందల పేట గ్రామం, పరిసర గ్రామాల నుండి భక్తులు విరువిగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది.

ఉగాది ఉత్సవాలకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర-పలాస: పలాస మండలం చిన్న గురుదాసు పురం గ్రామంలో ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుండి 30 వరకు రెండు రోజుల పాటు జిల్లా స్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి 15000 రూపాయలు ద్వితీయ బహుమతి 12 వేల రూపాయలు తృతీయ బహుమతి 10 వేల రూపాయలు చతుర్ధ బహుమతి పదివేల రూపాయలు, బెస్ట్ రైడర్ 2000 రూపాయలు, బెస్ట్ ఢిఫెండర్ 2000 రూపాయలు, బెస్ట్ ఆల్ రౌండర్ కు 3000 రూపాయలతో పాటు సీల్డ్ బహుకరిస్తామని తెలిపారు. అలాగే కబడ్డీ పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు ఉచిత వసతితో పాటు భోజన సదుపాయం ఉంటుందన్నారు. కబడ్డీ పోటీలో పాల్గొనే అభ్యర్థులు తమ చిరునామాతో పాటు మరిన్ని వివరాలకు పాలిని కృష్ణారావు, 7063942370, జనగ ధర్మారావు 9073527344, సాలిన రమేష్ 9908226194 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.చిన్న గురుదాసుపురం గ్రామ ప్రజల సహకారంతో ఈ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఒకే కేంద్రం కేటాయింపుపై రాష్ట్ర పరీక్షల పరిశీలకులు అసహనం

విశాలాంధ్ర-ఆమదాలవలస: పదవ తరగతి పరీక్షల్లో పట్టణంలోని ఎస్వీఎస్ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు 46 మంది గేట్ స్కూల్‌లో కేంద్రం కేటాయింపుపై పదవ తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకులు మస్తానయ్య ఒకింత ఆశ్చర్యం అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయం రెండు రోజులుగా పత్రికలు వార్త లు ప్రచురించడంతో ఆ పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఇలా ఒకే స్కూలు విద్యార్థు లు మొత్తం ఒకే కేంద్రం కేటాయింపు ఎలా సాధ్యం అంటూ అక్కడ పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెంట్ ను అడిగి తెలుసుకున్నారు. ఇది ఎలా సాధ్యపడిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వేర్ వాగ్దేవి సందర్శించి పరీక్షలు సక్రమంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది ఇలా ఉండగా ఎస్ వి ఎస్ పాఠశాల విద్యార్థులు 46 మందికి ఒకే కేంద్రం కేటాయింపు పై రాష్ట్ర పరీక్షల విభాగానికి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్ల ద్వారా ఫిర్యాదులు చేశారు. ఈ విషయం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

గ్రామ సమస్యలను పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-కవిటి: గ్రామంలోని నెలకొన్న సమస్యలన్నీ త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల అన్నారు. ఆమె సోమవారం కొత్తపాలెం గ్రామాన్ని సందర్శించి అక్కడ గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను ప్రభుత్వ విప్ అశోక్తో చెప్పి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బెందాళం అశోక్, మండల టీడీపీ కార్యదర్శి బెందాళం తిరుమల కుమార్, ఐ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పుల్లట రాజు, టీడీపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చేనేత మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

- సిక్కోలు వీవర్సు ప్రొడ్యూసర్ కంపెనీ సి.ఇ.వో అప్పలనాయుడు

విశాలాంధ్ర-పొందూరు: చేనేత మహిళలు స్వయం శక్తితో ఎదిగి ఆర్థికాభివృద్ధిని సాధించాలని సిక్కోలు వీవర్సు ప్రొడ్యూసర్ కంపెనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.అప్పలనాయుడు కోరారు. సోమవారం స్థానిక దేవాంగ సంఘ గ్రంథాలయంలో నబార్డు ఆధ్వర్యంలోని ఆర్ట్సు స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకల్లో నాయుడు పాల్గొని మార్గదర్శనం చేశారు. తమ సంస్థ చేనేత, రైతు మహిళలకు పెద్దపీట వేస్తూ వారి ప్రగతికి అన్ని విధాలా తోడ్పడుతోందని పేర్కొన్నారు.ఆ ర్ట్సు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కుప్పిలి పద్మ ప్రసన్న మాట్లాడుతూ నాబార్డుతో కలిసి పనిచేస్తున్న తమ సంస్థ వ్యవస్థాపకులు నూక సన్యాసిరావు ఆధ్వర్యంలో చేనేత విభాగంలో ఇంతవరకు వివిధ గ్రామాల్లో 515 మంది సభ్యులున్నారని పేర్కొన్నారు.మహిళా రైతు విభాగాన్ని ఏర్పాటు చేసి వీరికి కూడా అన్ని విధాలా చేయూత నందిస్తున్నామని అన్నారు.మహిళలు తలచుకుంటే అనేక సామాజిక రుగ్మతలను రూపుమాప గలరని, బాల్య వివాహాలు వంటి మూఢాచారాలను నిర్మూలించి, నవీన సమాజాన్ని ఏర్పాటు చేయగలరని అన్నారు.ప్రముఖ ఖాదీ, చేనేత పరిశ్రమల విశ్లేషకులు వాండ్రంగి కొండలరావు మాట్లాడుతూ పొందూరు ఖాదీ, చేనేతలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందడం వెనుక మహిళల పాత్ర గణనీయంగా ఉందని అన్నారు.గతంలో అనేక మంది ఈ వృత్తి పనివారలు జాతీయ అవార్డులు పొందడం విశేషమని కితాబునిచ్చారు. స్థానిక సొసైటీ మాజీ డైరెక్టర్లు ఆకాశం ఉమ,చందన భారతి చేనేత కార్మికులు హస్త కళానైపుణ్యం గురించి మాట్లాడారు.కార్మికులకు ప్రభుత్వం, నాబార్డు అన్ని విధాలా అండగా ఉంటేనే పరిశ్రమ నిలదొక్కుకుని ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నుంచి ప్రశంసలు పొందిన వడుకు, నేత కార్మికులు జల్లేపల్లి కాంతం, బల్ల భద్రయ్య లతో పాటు వృత్తిలో ప్రావీణ్యం సాధించిన మహిళలు జాడ సీతారత్నం, ఆనెం జ్యోతి,అంకం సత్యవతి, కాకర్ల రాజేశ్వరి, ఖాదీ, చేనేత విశ్లేషకులు వాండ్రంగి కొండలరావును ఈ సందర్భంగా ఆర్ట్స్ సంస్థ నేత వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. తొలుత మహాత్మా గాంధీ చిత్ర పటానికి కార్మికులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మొత్తం 60 మంది చేనేత మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఐతమ్‌లో అధ్యాపకులకు శిక్షణ

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పైతాన్ ఫర్ ఇంజినీరింగ్ అప్లికేషన్స్ అనే అంశంపై ఈనెల 17 నుండి 21 వరకు ఆన్ లైన్ ద్వారా జాతీయ స్థాయి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రొగ్రామ్ను నిర్వహిస్తున్నామని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి. నాగేశ్వరరావు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటిటిటిఆర్) చండీఘర్కు చెందిన సివిల్ విభాగం సౌజన్యం చేయగా, ఎలక్ట్రోనిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అకాడమీ ఐఐటి రూర్కీ, టెక్కలి ఐతమ్ సివిల్ విభాగాల సహకారంతో జరుగుతున్నాయన్నారు. ఈ తరగతుల్లో వివిధ యూనివర్శిటీలు, ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 54 మంది అధ్యాపకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఈ ఎఫ్ పి కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొదలవలస సురేష్, కో-కన్వీనర్లుగా అసోసియేట్ ప్రొఫెసర్ జి. గౌరీశంకర్రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రసన్న కుమార్లు వ్యవహరిస్తున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, సివిల్ హెచ్ ఒడి డాక్టర్ పి.దినకర్లు పర్యవేక్షణ చేస్తునట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్లను నిర్వహకులు జారీ చేస్తారని ఈ తరగతులను ప్రతీ ఒక్కరూ విధిగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు

విశాలాంధ్ర-పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటిలో ఇంటిపన్ను లు మార్చి నెలాఖరులోగా శత శాతం వసూళ్లు జరగాలని, వంద రోజుల్లో పారిశుధ్య సమస్యలు లేకుండా, ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటిగా తీర్చిదిద్దాలని మున్సివల్ కమిషనర్ ఎన్.రామారావు సచివాలయం అధికారులను ఆదేశించారు.సోమవారం పలాస మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, ఉత్తరాంధ్ర జిల్లాలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటిని నెంబర్ వన్ గా తీసుకురావాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల్లో మొత్తం పారిశుధ్య సమస్యలన్నీ గాడిలో పెట్టడానికి తగు ప్రణాళికతో ముందడుగు వేయాలని, ప్లాస్టిక్ నిషేదానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసే గుడ్డ సంచులను వినియోగించే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. ప్రభుత్వ గృహాలు నిర్మించేందుకు ప్రోత్సహించాలని, కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం గృహాల కోసం అదనంగా నిధులు కేటాయించిన విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఇప్పటి వరకు 68 దరఖాస్తులు మంజూరు కాబడినట్లు, 235 స్థలం లేనట్టి దరఖాస్తులు ఆన్ లైన్ రిజిస్టర్ కాబడినట్లు కమిషనర్ రామారావు తెలిపారు. ఇల్లు నిర్మాణం చేసుకొనుటకు మార్చి 31 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

బాలల హక్కులపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర బాలలరక్షణ హక్కుల పరిరక్షణ కమీషన్ చైర్మన్ కేశలి

విశాలాంధ్ర-పలాస: రాష్ట్రంలో బాలల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా బాలసదనం, అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర బాలల రక్షణ హక్కుల పరిరక్షణ కమీషన్ చైర్మన్ కేశలి అప్పారావు ఆదేశించారు.సోమవారం పలాస మండలం రంగోయి, పెంటిబద్ర అంగన్వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించి భవనాల పరిస్థితిని చూసి మరమత్తులు చేపట్టాలని ఆదేశించారు. పెంటిభద్ర అంగన్వాడీ భవనం ఎదురుగా పాడుబడిన బావిని చూపి పిల్లలకు ప్రమాదకరంగా ఉందని, బావిని తక్షణమే నిర్మూలించాలని ఆదేశించారు. అదే విదంగా అంగన్వాడీ, బాలసదనాలలో మధ్యాహ్న భోజన పధకాలను పరిశీలించి మెనూ, ఆహార పదార్ధల నాణ్యతను చూశారు. అదే విదంగా బాలలు, బాలింతలు, గర్భిణీ స్త్రీలతో ఆయన స్వయంగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు అందుతుందో లేదో అడిగి తెలుసుకొని ఎక్కడైనా లోటు పాట్లు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ పర్యటనలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ య.లక్ష్మి బాలల రక్షణ అధికారి మెట్ట మల్లేశ్వరరావు, పమగ్ర శిక్షణ నుంచి జసిడిఓ ఎన్. నిరజ, జిల్లా బాలల రక్షణ విభాగం నుంచి డి.సీతారాములు, ఆయనతో పాటు పలాస ఎంఇఓ 2 సత్యం, సూపర్ వైజర్లు సరస్వతి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర -ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అనుబంధ 14 బీఈడీ కళాశాలల విద్యార్థులకు సంబంధించి మూడో సెమిస్టర్ పరీక్షలు 6 కేంద్రాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. బీఆర్ఏయూ, శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, టెక్కలి, పాలకొండ, పలాసలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, జీసీఎస్ఆర్ కళాశాల (రాజాం)లోని పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగ తున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలకు మొత్తం 1,200 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

తొలిరోజు మేథ్స్, బయలాజికల్ సైన్స్ మెథడాలజీ సబ్జెక్టుకు పరీక్ష జరిగింది. వర్సిటీలో జరుగుతున్న ఈ పరీక్షలను వర్సిటీ కళాశాల ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. అనూరాధ పరిశీలించారు.

ఆన్‌లైన్ బెట్టింగులకు దూరంగా ఉండండి...

పుస్తెలు తాడు చోరీ కేసును ఛేదించిన పోలీసులు

కాశీబుగ్గ డిఎస్పీ వి.వెంకట అప్పారావు

విశాలాంధ్ర-పలాస: సెల్‌ఫోన్లతో ఎన్నో ఉపయోగాలు ఉన్న.. కొంతమంది వాటిని ఉపయోగించుకొని బాగుపడుతుంటే.. మరి కొంతమంది దొంగలుగా మారడం సమాజం విస్తుపోతుంది. సెల్ ఫోన్ల ద్వారా ఆన్ లైన్ లో బెట్టింగ్ లకు పాల్పడుతూ డబ్బులు పోగొట్టుకొని వాటిని తిరిగి సమకూర్చుకునేందుకు ఎటువంటి దారులు కనిపించకపోవడంతో దొంగలుగా తయారవుతున్నారు. ఈ కోవలోకి వస్తాడు ఇచ్ఛాపురం పురుషోత్తపురం కు చెందిన బంగారు బంది ప్రదీప్ ఐటిఐ విద్యార్థి ప్రదీప్ ఆన్ లైన్ బెట్టింగులు కట్టి రూ.1.10 లక్షల వరకూ కోల్పోవడంతో దాన్ని రాబట్టుకోవడానికి చైన్ స్నాచర్ గా మారాడు. కాశీబుగ్గ కోసంగిపురం శివాలయం వద్ద వృద్ధురాలు మెడలో తాళి బొట్టు చోరి కేసును ఎంతో చాకచక్యంగా కాశీబుగ్గ పోలీసులు ఛేదించి ప్రదీప్ ను అరెస్టు చేసి దొంగిలించిన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దొంగతనంపై కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు సోమవారం పోలీసే ష్టషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో వెల్లడించారు . ఇచ్ఛాపురం మున్సిపాలిటి పురుషోత్త పురంనకు చెందిన బంగారుబండి ప్రదీప్(19) విశాఖపట్నం ఐటిఐలో చేరి సగంలో చదువుకు స్వస్తి పలికాడు. ఇంటి వద్దే ఖాళీగా ఉండడంతో సెల్ ఫోన్ కు అలవాటు పడ్డాడు. ఆన్ లైన్ గేమ్స్, బెట్టింగులు కడుతూ కాలక్షేపం చేస్తుండేవాడు. ఈ క్రమంలో బెట్టింగుల్లో రూ.1.10 లక్షల వరకూ కోల్పోవడంతో ఇంటిలో తెలియకుండా ఆ నగదు తిరిగి ఇచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేసాడు. ఎక్కడా డబ్బులు సమకూరకపోవడంతో దొంగతనం చేసి ఆ డబ్బులు సేకరించాలని పథకం రచించాడు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన కిడ్నీ ఆసుపత్రి రోడ్డులో కోసంగిపురం గ్రామానికి చెందిన దుంపల యశోధ అనే వృద్ధురాలు తన భర్త అప్పన్న కిడ్నీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా ప్రదీప్ ఆమెను తన వాహనంలో స్వగ్రామం చేరుస్తానని మాయమాటలు చెప్పాడు. అనంతరం నిర్జీవ ప్రదేశానికి తీసుకువెళ్లి ఆమె మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేసి ఉడాయించాడు. దొంగిలించిన బంగారాన్ని పలాస రైల్వే కాలనీలో నివాసం ఉంటున్న రుసువా కిరణ్ కుమార్ కు ఇవ్వగా దాన్ని కాశీబుగ్గ రెల్లివీధికి చెందిన పవర్ రంజిత్ కు అమ్మకానికి ఇచ్చారు. రూ.1.77 వేలకు ఆభరణాలు అమ్మారు. ఇందులో కిరణ్ కుమార్ కు తన వాటాగా రూ.27 వేలు ఇవ్వగా మిగిలిన రూ.1.50వేలు నగదు ప్రదీప్ తీసుకున్నాడు. వాటాలు సక్రమంగా పంచుకొని ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా ప్రదీప్ ఆయన వాటాకు వచ్చిన నగదు కూడా ఆన్లైన్ బెట్టింగులు కట్టి పోగొట్టుకోవడంతో తన బాబాయ్ వరుసయిన కిరణ్ కుమార్ వద్దకు రూ.10వేలు కావాలని ఆదివారం పలాస చేరుకున్నాడు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు బృందాలుగా ఏర్పడి ఇచ్ఛాపురం, శ్రీకాకుళం వైపు వెతుకుతున్న క్రమంలో బంగారుబండి ప్రదీప్ తారాసపడ్డాడు. అనుమానంతో ఆయనను పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో చైన్ స్నాచింగ్ విషయాన్ని వెల్లడించాడు. వెంటనే ప్రదీప్ ను అరెస్టు సోమవారం పలాస కోర్టులో హాజరుపరుస్తున్నామని డీఎస్ పి తెలిపారు. కేసు ఛేదించిన పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పది పరీక్షల్లో ఆరుగురు గైర్హాజరు

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో 301 మంది పిల్లలు పరీక్ష రాయవలసి ఉండగా 299 మంది హాజరయ్యారని, బుడితి పరీక్షా కేంద్రంలో 173కు 169 మంది హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి ఎంవి రమణ తెలిపారు. 474 మంది 468 మంది హాజరయ్యారని ఆరుగురు పరీక్షకు హాజరు కాలేదని ఆయన వివరించారు. జలమూరు మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలకు 675 మందికి 675 మంది హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి బమ్మిడి మాధవరావు తెలిపారు.

బాటసారుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

- మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెందాళం విజయ్

విశాలాంధ్ర-కవిటి: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెందాళం విజయ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం బొరివంకలో హనుమాన్ జంక్షన్ వద్ద గ్రామ యువత ఆధ్వర్యంలో బాలాజీపుట్టుగ గ్రామానికి చెందిన లోల్ల శివాజీ ఆర్థిక సహకారం తో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా అలాగే పదవ తరగతి పరీక్షలు రాస్తున్నటువంటి విద్యార్థులకు పరీక్ష అనంతరం నిమ్మకాయ సబ్జా రసం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జే ఈ భాగీరథి దొళాయి, మాజీ సర్పంచ్ అంతర్యామి బిసాయి, భిమ్మో బిసాయి, బల్లెడ జయ ప్రకాష్, గ్రామస్తులు,యువత పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో ఆరు కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మొదటి రోజు మొదటి పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు అధికారులు విద్యార్థులు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. మొదటిరోజు పేపర్ చాలా సులువుగా ఉందని విద్యార్థులు పరీక్షా కేంద్రం నుండి బయటకు వచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేసుకున్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులకు తప్పించి ఏ ఒక్కరికి లోపలికి వెళ్ళనివ్వకుండా పటిష్ట పోలీసు బందోబస్తు కేంద్రాలు వద్ద ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

విద్యార్థుల మనోవేదనను అర్థం చేసుకోండి

విశాలాంధ్ర-టెక్కలి: విద్యార్థుల మనోవేదనను దయచేసి అర్థం చేసుకోండని జై భారత్ నేషనల్ పార్టీ ఇన్‌చార్జ్ బైపల్లి పరమేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి ని సోమవారం ఆయన కార్యాలయంలో పుష్పగుచ్ఛాన్ని అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆర్డీవోతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో గత కొన్నేళ్లుగా గ్రూప్-2 విద్యార్థులు పడుతున్న వేదనను ప్రభుత్వ పెద్దలు అర్థం చేసుకోవాలని, ఏ ప్రభుత్వంలో తప్పులు జరిగిన పక్కనపెట్టి పెద్ద మనసుతో 92,000 పైగా విద్యార్థుల జీవితాలు వాళ్ళ కుటుంబాల మనో వేదనను అర్థం చేసుకొని, ఎంతగానో ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతను ప్రభుత్వం ఆదుకోవాలని బైపల్లి కోరారు.

నివగాంలో కోతి హల్‌చల్

విశాలాంధ్ర - కొత్తూరు : ఎక్కడ్నుంచి వచ్చిందో గాని అందరినీ సరదాగా బేంబేలెత్తించింది ఒక కోతి. అసలే ఆదివారం. మధ్యాహ్నమంతా ఎండ. ఇంటి పట్టునే ఉండాలి కనుక ఉదయం పూట షికారులా బయటకొచ్చిన విద్యార్థులకు బలే సందడి కలిగించింది. ఈ సండే గెస్టుగారు అరుగులపై కూర్చుని, పెద్ద మేథావిలా ఆలోచిస్తున్నట్లు గోడలకి ఆనుకుని దర్జాగా కూర్చుని తెగ ఫోజులిచ్చింది. ఈ అనుకోని అతిథి కోతిమహారాజావారు డాబాలన్నీ దాటుకుంటూ ఊరంతా హల్ చల్ చేస్తూ పిల్లలకు వినోదాన్ని పంచింది. వాళ్ళని ఎగిరి గంతులేసుకునేలా చేసింది. అరటి పళ్ళు మున్నగు తినుబండారాలు దూరంగా ఉంచి పారిపోతుంటే ఆ ఫుడ్డుని ఎంచక్కా మంకీ గారు ఆరగిస్తుంటే బాలబాలికలంతా తెగ సంబరపడ్డారు. నివగాం ఊరంతా విజిట్ చేసిన సదరు మారుతి ఎక్కువ సమయం కాపువీధిలో గడిపి, ఊరు దాటేసింది. మళ్ళీ ఎప్పుడొస్తావ్ హనుమా అంటూ పిల్లలు ఆహ్లాదంగా టాటా బైబై చెప్పారు.

పది పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు విజయవంతంగా ప్రారంభం అయినట్లు మండల విద్యాశాఖ అధికారి ధనంజయ మజ్జి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం బాలుర ఉన్నత పాఠశాల రాజపురం,కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ఎస్విజెవిఎన్ హెచ్ఎస్,బొరివంక, బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10 వ తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు గాను 1018 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1014 మంది పరీక్షలకు హాజరయ్యి నలుగురు విద్యార్థులు గైర్హాజరయినట్లు ఎంఈఓ ధనుంజయ మజ్జి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించామని తెలియజేశారు.